'కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదు'

విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మాచారెడ్డి, ఫిబ్రవరి 9 : మండలంలో దళిత మహిళపై జరిగిన సంఘటనకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజలింగం తెలిపారు. శుక్రవారం గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. మహిళను వివస్త్రను చేసి కోట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తున్నదని అన్నారు. ఈ ఘటనకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎటువంటి సంబంధం లేదని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అక్కాపూర్ గ్రామ నాయకులు బట్ట దేవయ్య, చంద్రం, మద్దికుంట భూమయ్య, దేవయ్య, లింగం, పరశురాములు, కిషన్, మోతుకు నారాయణ, నౌసీలాల్, అలీఖాన్, బన్సీలాల్ తదితరులు ఉన్నారు.

నిందితులపై కేసు నమోదు చేయాలి

మాట్లాడుతున్న దళిత నాయకులు

మాచారెడ్డి, ఫిబ్రవరి 9 : దళిత మహిళపై జరిగిన ఘటనకు సంబంధించిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాకుగుట్టతండా సర్పంచ్ హేమ్లానాయక్, మాచారెడ్డి ఉపసర్పంచ్ రాంచంద్రం మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం ఓ జంటను వివస్త్రలుగా చేసి చిత్రహింసలు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకొని.. బాధితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో బట్ట రమేశ్, పోదర్ల రవి, రాజనర్సు, కృపానందం, దేవరాజు తదితరులు ఉన్నారు.

'అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మెద్దు'

బాన్సువాడ, ఫిబ్రవరి 9 : పట్టణంలో నాలుగు ఏండ్ల బాలుడు కిడ్నాప్ అయ్యాడని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని, అటువంటి అసత్యపు ప్రచారాలు నమ్మవద్దని బాన్సువాడ పట్టణ ఎస్‌హెచ్‌వో కృష్ణ శుక్రవారం తెలిపారు. ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఏదైనా సాధిస్తారు..

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఫిబ్రవరి 9 : ఏదైనా సాధించి చూపించేది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులేనని, వారిని తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ రంగంలో రాణించాలన్న చదువు ఎంతో అవసరమని అన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నాయన్నారు. సుమారు 150 మంది ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, కార్యదర్శి బాస రఘుకుమార్, డీఈవో రాజు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుషాల్, పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు గోవర్ధన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

ప్రారంభమైన అల్లమా ప్రభు జాతర

ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 9 : మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో శుక్రవారం అల్లమా ప్రభు జాతర ప్రారంభమైంది. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అల్లముడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధన్న కొండ వద్ద ఉన్న కుంటలో నీటిని తీసుకెళ్లి ఆత్మ లింగాన్ని పూజించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కొండ కింద జాతర వెలిసింది. శనివారం రథోత్సవం, నిండు జాతర, ఆదివారం కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎస్‌హెచ్‌వోను సన్మానించిన మైనార్టీ నాయకులు

బాన్సువాడ, ఫిబ్రవరి 9 : బాన్సువాడ పట్టణ ఎస్‌హెచ్‌వోగా కృష్ణ బాధ్యతలు చేపట్టగా బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ మైనార్టీ నాయకులు ఆయనను శుక్రవారం కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీ ఫంక్షన్ హాల్ అధ్యక్షుడు వాహబ్, యూసుఫ్, మహ్మద్ రజాక్, సయిమొద్దీన్, ఎండీ ఆజీమ్ తదితరులు ఉన్నారు.

ఎస్‌హెచ్‌వోను సన్మానిస్తున్న బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు

పలు శాఖలపై స్థాయీ సంఘ సమావేశం

మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ శోభ

కామారెడ్డి, ఫిబ్రవరి 9 : జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం కేజీ టూ పీజీ పథకం ద్వారా విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చిన విషయం తెలిసిందేనని అన్నారు. గురుకుల విద్యాలయం ద్వారా పేద గిరిజన బీసీ, ఎస్సీ విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ముందుకు వచ్చి విద్యా వ్యవస్థలో విప్లవం తీసుకువచ్చిందని అన్నారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బంది పడుతున్నారని, కేటగిరీ వారీగా మీ సేవలో స్లాట్ నమోదు చేసేలా తేదీలు ఇవ్వాలని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పీఎం అజయ్ పథకం కింద 28 యూనిట్‌గాను రూ.53 లక్షల విలువైన మోటర్లు, విద్యుత్ సౌకర్యంతో సహా మంజూరు చేసినట్లు తెలిపారు. జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సాయాగౌడ్, ఆయా శాఖల అధికారులు, జడ్పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల కళాశాలలో వైద్య శిబిరం

బాన్సువాడ, ఫిబ్రవరి 9 : పట్టణంలోని మహిళా జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎస్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా కళాశాల విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యురాలు మస్రత్ విద్యార్థులకు పరీక్షలు చేశారు.
ప్రిన్సిపాల్ జయకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మద్ది గంగాధర్, రమ్యశ్రీ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కంటైనర్.. డ్రైవర్ మృతి

భిక్కనూరు, ఫిబ్రవరి 9 : సీసీ కెమెరాల లోడ్‌తో వెళ్తున్న ఓ కంటైనర్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కడప నుంచి నోయిడాకు వెళ్తున్న కంటైనర్ మండల కేంద్రంలోని రామేశ్వర్‌పల్లి శివారులో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ అనిల్ కుమార్ బిందు(38) క్యాబిన్‌లో ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మెడికల్ సూపరింటెండెంట్‌కు కార్మికుల వినతి

సూపరింటెండెంట్‌కు శ్రీనివాస్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 9 : బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బాన్సువాడ మాతా-శిశు, ఏరియా దవాఖానలో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ టేకర్ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వేతనాలను వెంటనే చెల్లించేలా సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులతో చర్చిస్తానని అన్నారు. కార్యక్రమంలో దవాఖాన కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్ల పట్టివేత

బాన్సువాడ, ఫిబ్రవరి 9 : బాన్సువాడ అటవీశాఖ రేంజ్ పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, కలపను తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు పట్టుకన్నారు. ఎఫ్ఆర్‌వో హబీబ్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి నిజాంసాగర్ మండలం సింగీతం గ్రామ అటవీ శివారు నుంచి అక్రమంగా తరలిస్తున్న కలప ట్రాక్టర్ ను బీట్, అటవీశాఖ సెక్షన్ అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు. రూ.26 వేల జరిమానా విధించినట్లు చెప్పారు. కలప ట్రాక్టర్‌ను అటవీశాఖ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.లక్ష 25 వేల విలువైన కలపను పట్టుకున్నట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు వైష్ణవి, శ్రీనివాస్, చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 9 : మండలంలోని ఇబ్రహీంపేట్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణానగర్ తండా అటవీ శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అటవీ ప్రాంతం నుంచి గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తుండగా వాటిని పట్టుకొని బాన్సువాడ అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. ట్రాక్టర్లను పట్టుకున్న వారిలో అటవీశాఖ అధికారులు నరేశ్, చంద్రకాంత్, శ్రీనివాస్ ఉన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9 : కామారెడ్డి మండలం టేక్రియాల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-3 శీతాకాల శిబిరం శుక్రవారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అమ్మాయిలు కూడా సేవ చేసేందుకు ముందుకు సాగాలన్నారు. ప్రముఖ న్యాయవాది సిద్ధరాములు భారత రాజ్యాంగం, హక్కులు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంకర్ రావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ శంకర్, అధ్యాపకులు సుచరణ్, మల్సూర్, టేక్రియాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొమలంచలో విషజ్వరాలు

కొనసాగుతున్న ప్రత్యేక వైద్య శిబిరం

ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరిస్తున్న అధికారులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 9: మహ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో విష జ్వరాలు ప్రబలుతూనే ఉన్నాయి. దీంతో గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం శుక్రవారం మూడో రోజు కూడా కొనసాగింది. శిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించారు. ఇద్దరికి ప్లేట్‌లేట్స్ తగ్గుముఖం పట్టడంతో బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు. మూడురోజులుగా 120 మంది విష జ్వరాల బారిన పడ్డారు. గ్రామంలోని బండాగల్లీ, కుర్మగల్లీకి చెందిన వారికి మాత్రమే జ్వరాలు వచ్చాయని, ఈ గల్లీలకు ఒకే ట్యాంక్ ద్వారా నీరు సరఫరా అవుతుందని, నీటితోనే విష జ్వరాలు వస్తున్నాయని అధికారులు తెలిపారు. బోర్లం గురుకుల పాఠశాలలో చదివే కొమలంచకు చెందిన ఓ విద్యార్థికి ఇటీవల డెంగీ సోకిందని అన్నారు. రక్త పరీక్షలు నిర్వహించగా.. సాధారణ జ్వరం లక్షణాలే ఉంటున్నాయని వైద్యాధికారులు తెలిపారు. జ్వరం వచ్చి ప్లేట్‌లేట్స్ తగ్గడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎంపీడీవో నాగేశ్వర్, ఎంపీవో అబ్బాగౌడ్, మిషన్ భగీరథ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, వైద్యులు రాధాకిషన్, రత్నం, సలోమి, తానాజీ తదితరులు శుక్రవారం గ్రామంలో ఇంటింటికీ పర్యటించారు. రోగులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉన్నదని వైద్యులు తెలిపారు. వైద్య సిబ్బంది దయానంద్, సాయిలు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రణీత

సంజన

గాంధారి, ఫిబ్రవరి 9: జాతీయ స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు మండలంలోని బామన్‌నాయక్ ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన ఇద్దరు క్రీడాకారిణులు ప్రణీత, సంజన ఎంపికైనట్లు పీఈటీ లక్ష్మణ్ రాథోడ్ శుక్రవారం తెలిపారు. వరంగల్ జిల్లా తొర్రూర్‌లో ఈనెల 7నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపడంతో నిర్వాహకులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. ఈనెల 10, 11వ తేదీల్లో మహారాష్ట్రలోని దమంగల్‌లో నిర్వహించే జాతీయ స్థాయిలో పోటీల్లో వారు తెలంగాణ తరపున పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను బామన్‌నాయక్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు గుగ్లోత్ సురేందర్, చైర్మన్ సెవంతా రాథోడ్‌తోపాటు గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9: వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని మండల విద్యాధికారి వెంకటేశం సూచించారు. విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకొని చదువుపై దృష్టి సారించాలన్నారు. మండలంలోని మాచాపూర్ గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులతో శుక్రవారం నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల పలు సందేహాలను నివృత్తి చేశారు. భయం లేకుండా పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హ్యాపి నైట్స్ బార్ & రెస్టారెంట్, గిరిరాజ్ కాలేజి ఎదురుగా దుబ్బ బైపాస్ రోడ్ నిజామాబాద్‌లో పనిచేయుటకు అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, కుక్, వేయిటర్, సెల్స్‌మెన్, బౌన్సర్, డిజే ఆపరేటర్ & డ్రైవర్ కావలెను. సెల్: 9440645449.
NTZ-5934

WANTED

★నిజామాబాద్‌లో పనిచేయుటకు LADY CARE TAKER కావలెను. భోజనం + వసతి సౌకర్యం + జీతం ఇవ్వబడును. సంప్రదించండి. ఫోన్ : 9154545433
NTZ-324515

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

పిట్లం, ఫిబ్రవరి 9: పిట్లం ప్రభుత్వ దవాఖానలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణుడు హరికిషన్‌రావు 63 మందిని పరీక్షించాడు. వారిలో తొమ్మిది మందిని ఆపరేషన్ నిమిత్తం ప్రత్యేక వాహనంలో బోధన్‌లోని లయన్స్ కంటి దవాఖానకు తరలించారు. వైద్యాధికారులు శివకుమార్, సమద్, లయన్స్ సభ్యులు కాశీరెడ్డి పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

పిట్లం, ఫిబ్రవరి 9: మండలకేంద్రానికి చెందిన దండు లక్ష్మణ్ శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడని హెడ్ కానిస్టేబుల్ సాయాగౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్ కుటుంబంలో కలహాలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన అతడు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటికి చేరుకొని తలుపులను పగులగొట్టి, బాధితుడికి సీపీఆర్ చేసి పిట్లం దవాఖానకు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు.

జిల్లాలో మాఘ అమావాస్య సందడి

- నదుల్లో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తులకు అన్నదానం

జిల్లా ప్రజలు మాఘ అమావాస్యను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నదుల్లో పుణ్య స్నానాలను ఆచరించారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నాగమడుగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

నాగమడుగులో పుణ్య స్నానాలు చేసిన భక్తులు..

నిజాంసాగర్, ఫిబ్రవరి 9: మండలంలోని అచ్చంపేట గ్రామ శివారులోని మంజీరా పరీవాహక ప్రాంతంలోని నాగమడుగు వద్ద మాఘ అమావాస్య సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్యస్నానాలు చేశారు. ఉమ్మడి జిల్లాతోపాటు పక్కనే ఉన్న సంగారెడ్డి, మెదక్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పుణ్యస్నానాలు చేసిన అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అచ్చంపేట గ్రామస్తులు భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు సత్యనారాయణ, రమేశ్, లక్ష్మణ్, సాయిబాబా, ఎల్లయ్య, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో..

రామారెడ్డి, ఫిబ్రవరి 9: మండలంలోని మద్దికుంట అటవీ ప్రాంతంలో ఉన్న బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో భక్తులు మాఘ అమావాస్య స్నానాలను ఆచరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జూపల్లి తిరుపతిరెడ్డి, సంతోష్‌గౌడ్, బొమ్మిడి సంతోష్, వడ్ల బ్రహ్మచారి సౌజన్యంతో భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాతలను ఆలయ కమిటీ బాధ్యులు, పూజారులు శాలువా కప్పి, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోజారి లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఆలయ పూజారులు ప్రభాకర్ స్వామి, గణేశ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక ఇబ్బందులు..

ఆలయానికి వెళ్లడానికి ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాఘ అమావాస్య సందర్భంగా ప్రతి సంవత్సరం కామారెడ్డి డిపో వారు ఆలయానికి ప్రత్యేకంగా మూడు ఆర్టీసీ బస్సులను నడిపేవారు. ప్రస్తుతం ఒకే బస్సును నడపడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చిందని భక్తులు ఆవేదన వ్యక్తంచేశారు. పండుగ రోజుల్లో ఆలయానికి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

హనుమాన్ ఆలయంలో హోమం..

పిట్లం, ఫిబ్రవరి 9: మండలంలోని పోతిరెడ్డిపల్లి హనుమాన్ ఆలయం వద్ద మాఘ అమావాస్యను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకుడు తేజస్వామి తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో..

మాచారెడ్డి/దోమకొండ/భిక్కనూరు/బీబీపేట్, ఫిబ్రవరి 9 : మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలోని శ్రీవీరహనుమాన్, పాల్వంచ మండలం బండరామేశ్వర్‌పల్లిలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దోమకొండలోని గుండ్ల చెరువు సమీపంలో ఉన్న కటికం మల్లేశుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. భిక్కనూరు మండలం జంగంపల్లిలో గంగమ్మకు, పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులోని దేవేంద్రుని గుట్టపై కొలువుదిరిన శివాలయంలో వేద పండితులు పూజలు నిర్వహించారు. బీబీపేట్ మండలంలోని మాందాపూర్, దోమకొండ మండలంలోని సంగమేశ్వర్, భిక్కనూర్ మండలంలోని కాచాపూర్ గ్రామాల శివారు సరిహద్దు అయిన బొమ్మలుదిగే పోచమ్మ ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు.

పోతిరెడ్డిపల్లిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

జంగంపల్లిలో తెప్ప, బోనాల ఊరేగింపు

బుగ్గరామలింగేశ్వరాలయంలో భక్తులకు అన్నదానం

ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని ఆర్డీవోకు వినతి

రామారెడ్డి, ఫిబ్రవరి 9: ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్ రావుపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఎంపీటీసీ సభ్యులు ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆర్డీవోను శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మొత్తం ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా.. ఏడుగురు సభ్యులు ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాసాన్ని వ్యక్తంచేస్తున్నారు.

ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీటీసీలు

సాతెల్లిలో రేషన్ దుకాణం ప్రారంభం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 9: మండలంలోని సాతెల్లి గ్రామంలో కొత్తగా రేషన్ దుకాణాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇదివరకు గ్రామం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జంగమాయిపల్లి గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఈ విషయమై గ్రామస్తులు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఈ విషయమై వెంటనే రెవెన్యూ అధికారులతో మాట్లాడి రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో షాపును ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

గాంధారి, ఫిబ్రవరి 9: మండలంలోని గౌరారం సాయిబాబా ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ బాధ్యులు కోరారు.

రైతులు వరిని క్షుణ్ణంగా పరిశీలించాలి

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 9: రైతులు వరి రెండు రోజులకు ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించాలని, చీడపీడల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏఈవో రవీందర్ సూచించారు. మండలంలోని జంగమాయిపల్లి, బ్రాహ్మణ్‌పల్లి గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న వరి పంటను ఆయన శుక్రవారం పరిశీలించారు. వరికి ప్రస్తుతం మొగి పురుగు ఆశిస్తున్నదని, దీని నివారణకు క్లోరో ఫెరిపాస్ 50 ఈసీ 300ఎంఎల్‌ను ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. చిరుపొట్టదశలో ఉన్న వరికి మొగి పురుగు ఆశిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రాములు లేదా కోరోజిన్ 60 ఎంఎల్‌ను ఎకరానికి పిచికారీ చేసి పురుగును నివారించవచ